


శనివారం 25 ఏప్రిల్ 2026 పేజీలు : 8

## శనగలు, జొన్నలు తక్షణమే కొనుగోలు చేయాలి

వ్యవసాయ మంత్రికి పాయల్ శంకర్



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** రాష్ట్ర వ్యాప్తంగా, ప్రత్యేకించి అదిలాబాద్ జిల్లా రైతులు కష్టపడి పండించిన శనగలు జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని బీజేఎల్పీ ఉపనేత, అదిలాబాద్ ఎమ్మెల్యే పా యల్ శంకర్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మం త్రి తుమ్మల నాగేశ్వర రావు రికి లేఖ రాసి విజ్ఞప్తి చేశారు.రైతులు పంటలు పండించినా కనీస మద్దతు ధర అందక తీవ్ర నష్టాలను చవి చూస్తు న్నారని ఆయన లేఖలో పేర్కొ న్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే సేక రణ జరగకపోతే అన్నదాతలు మరింత ఆర్థిక కష్టాల పాలవు తారని హెచ్చరించారు. మార్కె ట్లో శనగలు, జొన్నలకు తగిన ధర రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని పాయల్ శంకర్ మంత్రికి చేసిన లేఖలో స్పష్టంగా కోరారు. రైతు సంక్షే మం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే బీజేఎల్పీ పార్టీ రైతుల పక్షాన పోరాటం చే స్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు.

## భోజనం పెట్టేందుకు వొస్తే బీ జే పీ కౌన్సిలర్లు, నాయకుల అరెస్టులు



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న స మ్మెకు మద్దతుగా నిలిచి భో జనం పెట్టేందుకు వొస్తే బీజేపీ కౌన్సిలర్లు, నాయకుల అరెస్టు లు, ఉద్రిక్తతకు దారితీసింది. ఆర్టీసీ సమ్మె శుక్రవారం తో మూడవ రోజుకు చేరుకున్న సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు సంఘీభావం తెలి పారు. డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులకు మధ్యా హ్న భోజనం పెట్టేందుకు నా యకులు వంటలు సిద్ధం చే స్తుండగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తతత నెలకొంది. డీఎస్పీ జీవన్ రెడ్డి, వన్ టౌన్, టూ టౌన్ సీఐలు అక్కడి చేరుకుని బీజేపీ నా యకులు పాయల శరత్ తో పాటు కౌన్సిలర్లను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్ కు తరలించేందుకు యత్నించగా ఆర్టీసీ కార్మికులు పోలీసుల వాహనానికి అడ్డుపడ్డారు.

## రైతుకు నమ్మకమైన విత్తనమే అందించడమే లక్ష్యం



రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడం ముఖ్య లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఎఫ్‌పీఓలతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశంను నిర్వహించారు.

## వడ్డీ వ్యాపారులపై కొరడా

### రైతులు, ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

అధిక వడ్డీలతో రైతులు, ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా జులిపించారు.జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో 45 బృందాలచే 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహిం చారు. 16 మండలాలలో దాడులు చేపట్టి, 7 పోలీస్ స్టేషన్లో పరిధిలో 15 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ ప్రకటించారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, చెక్కులు, పాస్ బుక్కులు, బాండ్ పేపర్స్, సేల్ డీడ్స్ స్వాధీనం చేసుకున్నారు.



# డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విరమించము

## స్పష్టం చేసిన మంచిర్యాల ఆర్టీసీ కార్మికులు



**మంచిర్యాల, 24,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని మంచిర్యాల డిపో ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేశారు. టీజీ ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మంచిర్యాల డిపో కార్మికులు మూడవ రోజూ సమ్మెను కొనసాగించారు. రెండో రోజు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి తమ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లిన కార్మికులు, సమ్మె మూడో రోజు శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో ముందు మౌన పోరాటం చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఒకచోట కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పురుష, మహిళా డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా నర్సంపేటలో ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్‌కు నివాళు లర్పించిన అనంతరం, కార్మికులు నోటికి నల్ల గుడ్డలు కట్టుకుని మౌన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిపో జేఏసీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి మామిడిపెల్లి శ్రీనివాస్, కన్నూరు (బొట్టు) లక్ష్మణ్, సేని తిరుపతి, సుదర్శన్ రెడ్డి, తోట సత్తయ్యతో పాటు జేఏసీ సభ్యులు పోలు రాజేశం, గాదె శంకర్, గాదె భాస్కర్, అప్పారావు, మేకల మల్లేష్, చుంచు వెంకటేష్, బ్రేక్ శ్రీనివాస్, ఏ.ఎం. ఖాన్, మెకానిక్ శంకరయ్య, జ్యోతి, ఉమా రాణి, అనూష, చంద్రకళలు, రాచర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది సమ్మెలో పాల్గొంటున్నారు. కాగా, మంచిర్యాల ఆర్టీసీ డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు ప్రతిరోజూ బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ తదితర రాజకీయ పార్టీలతో పాటు పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. చర్చలపై కార్మికుల్లో ఆశలు ఇదిలా ఉండగా, గత మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మె నేపథ్యంలో శుక్రవారం కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. కార్మికుల డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్న నమ్మకంతో ఆర్టీసీ సిబ్బంది ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ సమావేశం జరుగనుండగా, తక్షణమే పరిష్కరించగల అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. మరోవైపు, కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుతూ, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని హామీ ఇచ్చారు. చర్చలు సఫలమవుతాయా లేదా అనేది చూడాల్సి ఉంది. కాగా మంచిర్యాల బస్టాండ్ నుంచి సరిపడా బస్సులు లేకపోవడంతో సమ్మె కారణంగా దూర ప్రాంతాలకు అదే విధంగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. సమ్మె కారణంగా కేవలం ప్రైవేట్ బస్సులు మాత్రమే నడుస్తుండగా, ప్రభుత్వ బస్సులన్నీ ఆర్టీసీ డిపో లోనే ఉండిపోయాయి. త్వరగా సమ్మె పరిష్కారం కావాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కూడా ఈ సందర్భంగా చెప్పడం కోసం మెరుపు.

# తెలంగాణ మున్నూరు కాపు సంఘం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బాధ్యులుగా గాదె సత్యనారాయణ పటేల్

**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి, మంచిర్యాల జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు గాదె సత్యనారాయణ పటేల్‌ను కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బాధ్యులుగా నియమించారు. ఈ నియామ కాన్ని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమ రావు పటేల్ ప్రకటించారు. శుక్ర వారం జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్యనారాయణ పటేల్ కు నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు స్వయంగా అందజేశారు. జిల్లా బాధ్యులుగా గాదె సత్యనారాయణ పటేల్ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకుంటూ మున్నూరు కాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను అభినందిస్తూ, కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘానికి చెందిన పలువురు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతీ రోజు నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు జరగాలి

## వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికలు అవసరం

## డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు



**మంచిర్యాల, ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):** ప్రతిరోజూ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి, ఓబీ (ఓవర్ బర్డెన్) తొలగింపు కచ్చితంగా జరగాలని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికల తో ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు సూచించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా పర్యటనలో భాగంగా ఆయన ఎస్ఆర్పీ ఓసీపీ ఉపరితల గనిని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్వారీ, వివిధ పని ప్రదేశాలను పరిశీలిస్తూ ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తి, యంత్రాల పనితీరు తదితర అంశాలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రస్తుత పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసు కున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను సాధించడమే ముఖ్యమని అ న్నారు. భద్రతతో కూడిన ఉత్పత్తి పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రతీ రోజు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి, ఓబీ తొలగింపు జరగాలని ఆదేశించారు. అనంతరం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో జీఎం మునిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్షా సమావేశాను నిర్వహించారు. ఏరియా పరిధిలోని భూగర్భ గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో జరుగుతున్న కార్యకలా పాలపై అధికారులు వివరాలు అందించారు. సంస్థ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రం, ఏరియా ఇంజనీర్ రమణారావు, ఎస్ఆర్పీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ చి. వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, ఇన్‌చార్జ్ మేనేజర్ మధుసూదన్, సీహెచ్పీ ఇన్‌చార్జ్ విశ్వేశ్వరయ్య, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు తెలిసేలా వాస్తవాలను ప్రచురించాలి

## జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలను ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ అన్నారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరం లో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దినపత్రికలు మరియు న్యూస్ చానళ్లు ప్రజలకు నిజమైన సమాచారం అందించే బాధ్యతతో పనిచేయాలని సూచించారు. 2026--28 సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నంబర్ 252, ఆర్.టి. 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హతలేని వ్యక్తులు పాత్రికేయులుగా వ్యవహరించడం వల్ల అసలైన జర్నలిస్టులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కోసం ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్గువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్ పాల్గొన్నారు. అలాగే జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి. రవితేజ, మంత్రి సునీల్ కుమార్ హాజరయ్యారు.

# మేకల మండి వేలంలో మాయాజాలం

**మంచిర్యాలరూరల్ ఏప్రిల్24(ప్రజాజ్యోతి)** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన మేకల మండీ వేలంలో కొన్ని లోపాలు జరిగాయాని ప్రజలు ఆరోపిస్తున్నారు.సాధారణంగా ప్రజా ఆదాయ వనరుగా ఉండాల్సిన ఈవేలం ప్రక్రియలో పారదర్శకత లోపించిందని,ప్రభుత్వ నిబంధనలు సరిగా అమలు కావడంలేదని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.వేలం నిర్వహణ తీరు పాల్గొనేవారి సంఖ్య,చెల్లింపుల విధానం కలిపి అనుమానాలకు దారితీస్తున్నాయి.తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం--2019 ప్రకారం, మున్సిపల్ ఆదాయ వనరులైన మేకల మండీలు, కాంట్రాక్టుల వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలి. నోటిఫికేషన్‌ను విస్తృతంగా ప్రచారం చేయడం,పోటీ వాతావరణాన్ని కల్పించడం,అల్పసంఖ్యలో బిడ్స్ పాల్గొంటే వేలాన్ని వాయిదా వేయడం వంటి నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి.అలాగే కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి నిర్ణీత శాతం సెక్యూరిటీ డిపాజిట్‌ను ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.చెల్లింపుల్లో ఆలస్యం జరిగితే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.కాని మంచిర్యాల కార్పొరేషన్ ఈనిబంధనలు అమలవుతున్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.ఈ ఏడాది మూడో నెలలో జరిగిన మేకల మండీ వేలం సుమారు 79 లక్షల 5వేల రూపాయల వరకు సాగింది.కానీ ఈభారీ మొత్తానికి పోటీగా కేవలం నలుగురు మాత్రమే పాల్గొనడం గమనార్హం.సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో వేలాన్ని వాయిదా వేయాల్సి ఉన్నప్పటికీ,అధికారులు అలా చేయలేదు అనే ఆరోపణలు ప్రజల్లో బలంగా వినిపిస్తున్నాయి.ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే,వేలం దక్కించుకున్న వ్యక్తి మొత్తంలో చాలా తక్కువ భాగాన్ని మాత్రమే ముందుగా చెల్లించినట్లు సమాచారం.సుమారు 2 లక్షల 50 వేల రూపాయలను డీడీ రూపంలో,మరో 6 లక్షల రూపాయలను మార్చి 31న చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.ఇది మొత్తం వేలం మొత్తానికి 15 శాతం కన్నా తక్కువ.సాధారణంగా కాంట్రాక్టుల్లో 25శాతం వేలం దక్కించుకున్న వ్యాపరీ చెల్లించాలని చట్టంలో ఉన్నట్టు సమాచారం. కార్పొరేషన్ అధికారులు వేలంలో నిబంధనలు ఎందుకు సడలించబడ్డాయో స్పష్టత లేదు.చెల్లింపులలో ఆలస్యం జరిగిన నేపథ్యంలో ఏప్రిల్ 16న నోటీసులు జారీ చేసినట్లు అధికారులు




పేర్కొన్నప్పటికీ,ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు.ఇది మొత్తం వ్యవహారంపై మరింత అనుమానాలను పెంచుతోంది.వేలం నోటిఫికేషన్ ప్రక్రియ కూడా ప్రశ్నార్థకంగా మారింది. అధికారికంగా పత్రికా ప్రకటనలు విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ,అవి ప్రజలకు విస్తృతంగా చేరలేదని స్థానికులు అంటున్నారు.గ్రామాలు,వ్యాపార వర్గాలు, మార్కెట్ యూజర్లకు ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు లేకపోవడం వల్లే పాల్గొనేవారి సంఖ్య తగ్గిపోయిందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో టామ్‌టామ్ వంటి పద్ధతుల ద్వారా ప్రజలకు సమాచారం అందించేవారు.కానీ ఇప్పుడు అలాంటి చర్యలు కనిపించడం లేదు.గత మూడు నాలుగు సంవత్సరాలుగా వేలంలో పాల్గొనేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోవడం కూడా అనుమానాలకు కారణమవుతోంది.పోటీ లేకపోవడం వల్ల కొద్ది మంది మధ్యే కాంట్రాక్టుల చుట్టే వేలం పాట తిరుగుతున్నాయనే భావన ప్రజల్లో పెరుగుతోంది. ఇది కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయాన్ని కూడా ప్రభావితం చేసే ప్రమాదం ఉంది.మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేకల మండీ వేలం ప్రక్రియలో నిబంధనలు ఉన్నప్పటికీ, అవి అమలులో సరిగా పాటించబడుతున్నాయా అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.ప్రజా వనరుల వినియోగంలో పారదర్శకత అత్యవసరం. అధికారులు ఈ అంశంపై స్పష్టత ఇచ్చి,అన్ని వివరాలను ప్రజలకు వెల్లడించి,నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.లేనిపక్షంలో ఈ అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉందని, ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# సింగరేణి ఎస్టిపిపి ఆధ్వర్యంలో రామారావుపేటలో ఉచిత వైద్య శిబిరం

**జైపూర్ ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని రామారావుపేట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామ ప్రజలు మంచి స్పందన కనబరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టిపిపి జనరల్ మేనేజర్ ఎం. మదన్మోహన్ మాట్లాడుతూ, సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాంట్ ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ శిబిరాల ద్వారా గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులను ముందుగానే గుర్తించి, వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన



సూచించారు.ఈ సందర్భంగా డాక్టర్ కె. పవన్ మాట్లాడుతూ, శిబిరంలో మహిళలు, వృద్ధులు, ఇతర రోగులు కలిపి మొత్తం 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.గ్రామ ప్రజల ఆరోగ్య సంక్షేమానికి సింగరేణి చేపడుతున్న ఈ చర్యలను స్థానికులు అభినందించారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ:



**జన్నారం,ఏప్రిల్ 24(ప్రజాజ్యోతి)** చింతగూడ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సర్పంచ్ సుతారి సుమలత బుధవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. పని ప్రాంతంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, ఎండ నుంచి రక్షణ కోసం నీడ నెట్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, కార్యదర్శి రాజన్న, ఉప సర్పంచ్ అసంపెల్లి కావ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన

-ప్రగతి ప్రణాళిక



**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో శుక్రవారం ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా అధ్యాపకులకు "కెపాసిటీ బిల్డింగ్" (సామర్థ్యాల పెంపు) కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామక పాండు రంగ శర్మ అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ, బోధనలో మెలకువలను నేర్చుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కృషి చేయాలని తెలిపారు. అధ్యాపకులు బోధనలో గల అనుభవాలను తోటి అధ్యాపకులతో పంచుకుంటూ విద్యా ప్రమాణాల పెంపుపై చర్చించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

## వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

**జన్నారం,ఏప్రిల్24(ప్రజాజ్యోతి)** శ్రీ వాసవి మాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగ జాబితాలో చేర్చడంపై జన్నారం వర్తక సంఘం అధ్యక్షులు వోజ్జల వామన్ కుమార్ హర్షం వ్యక్తం చేసారు.ఈ మేరకు వర్తక సంఘం అధ్యక్షులు గౌ.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ఆర్య వైశ్యుల చిరకాల వాంఛ అని, ప్రభుత్వ నిర్ణయం సమాజానికి గౌరవం కలిగించిందని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ ఆర్య వైశ్య కార్పొరేషన్, ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కృషిని కూడా ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్, కోశాధికారి శివరామకృష్ణ,సంఘ సభ్యులు ఉన్నారు.

## పక్కాగా జనాభా గణన చేపట్టాలి

**-తహసిల్దార్ రోహిత్ దేశ్‌పాండే ఆదేశం**

**-దండేపల్లిలో ఎన్యూమరేటర్లకు శిక్షణ**



**దండేపల్లి, ఏప్రిల్ 24(ప్రజాజ్యోతి):** జనాభా గణన ప్రక్రియను అత్యంత పటిష్టంగా, లోప రహితంగా నిర్వహించాలని తహసిల్దార్ రోహిత్ దేశ్‌పాండే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల మంజూరుతో పాటు వివిధ అవసరాలకు ఈ గణాంకాలే ప్రాతిపదిక అవుతాయని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, పారదర్శకంగా వివరాలు సేకరించాలని సూచించారు.అనంతరం గణన ప్రక్రియకు సంబంధించిన సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మండల ప్రణాళిక గణాంకాధికారి రమేష్, శిక్షకుడు రమేష్‌కుమార్, పాఠశాల ఇన్‌ఛార్జి అప్పాల మనోహర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బొద్దుల భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా సింగరేణి కమ్యూనిటీ హాల్

**ఉపయోగంలోకి తీసుకురావాలని ఇందారం పీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి**



**జైపూర్, ఏప్రిల్ 24:**ప్రజా జ్యోతి జైపూర్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన ఇందారం గ్రామంలో కాసింపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జ్ సమీపంలో సింగరేణి కమ్యూనిటీ డెవలప్మెంట్ వర్క్ నిధులతో రూ.29.97 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారిందని టిఆర్ఎస్ నాయకులు తెలిపారు.నిర్మాణం పూర్తై రెండేళ్లు దాటినా ఇప్పటికీ ప్రజల వినియోగంలోకి తీసుకురాకపోవడం స్థానికుల్లో ఆగ్రహానికి దారితీస్తోందని అన్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం ఇందారం మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు అర్కే సంతోష్ యాదవ్, మాజీ వార్డ్ సభ్యుడు అమీర్ కలిసి ఇందారం పీవో వెంకటేశ్వర రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంట్రాక్టర్‌కు పూర్తి చెల్లింపులు జరిగినప్పటికీ భవనం ప్రారంభించకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల కోసం ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో వేల రూపాయలు అదనంగా ఖర్చవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి, ప్రజల అవసరాల కోసం నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్‌ను వెంటనే ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

## పుష్యమి నక్షత్రం రోజున పిల్లలకు స్వరామృత ప్రాసన



**రామకృష్ణాపూర్,ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి):**రామకృష్ణాపూర్‌లో వికాస తరంగిణి గోవింద్ పరివార్ ఆధ్వర్యంలో 16 సంవత్సరాల లోపు పిల్లలకు స్వరామృత ప్రాసన మందు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున ఈ మందును రెండు చుక్కలు లేదా బిళ్లల రూపంలో అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ మందు మేధాశక్తి, జ్ఞాపకశక్తి, జీర్ణశక్తి మరియు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుందని వివరించారు. వచ్చే మే 21న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు సూపర్ బజార్ చౌరస్తాలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, 16 ఏళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

## బెజ్జూర్ లో అన్ని గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు

**మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్**






**ఏప్రిల్ 24, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజకవర్గం లోని బెజ్జూర్ మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీఓ శ్రీనివాస్ ఆదేశాల మేరకు 22 గ్రామపంచాయతీల సెక్రెటరీల అధ్యక్షతన గ్రామ సభలను ఏర్పాటు చేశారు. పంచాయతీ పాలకవర్గం సర్పంచులు, ఉపసర్పంచ్లు,వార్డ్ మెంబర్లు ప్రజలతో కలిసి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. అనంతరం సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి ఈ గ్రామ సభలో ఈ ఆర్థిక సంవత్సరం గ్రామ పంచాయతీలో నిర్వహించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. వేసవికాలం దృశ్యా నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వీధి దీపాలు పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించా లని మండల పంచాయతీ అధికారి సిబ్బందికి సూచించారు.

## రోడ్డు భద్రతపై సింగరేణి స్టిపిపిలో అవగాహన కార్యక్రమం



**జైపూర్ ఏప్రిల్ 24:**ప్రజా జ్యోతి జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ లో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎం. మదన్ మోహన్ హాజరయ్యారు.ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రత్యేక ఆకర్షణగా శ్రీరాంపూర్ కళాకారులు తాజుద్దీన్,మేడ పెద్దయ్య యముడు, చిత్రగుప్తుని వేషధారణలో ప్రదర్శన ఇచ్చి వాహనదారుల్లో చైతన్యం కల్పించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ కట్టుకోవాలని సూచించారు.రోడ్డు నియమాలు పాటించకపోతే ప్రమాదాలు సంభవించి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అనంతరం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జీఎం మదన్ మోహన్ మాట్లాడుతూ, ప్రమాదాలు జరిగాక బాధపడటానికి బదులుగా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.సమయానికి చేరుకోవడం కంటే సురక్షితంగా ఇంటికి చేరుకోవడం ముఖ్యమని తెలిపారు.అందుకే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ హెల్మెట్ సీటు బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ డి. పంతులు, పవర్ మెక్ ప్లాంట్ హెడ్ అఖిల్ కపూర్,డిజీఎంలు శివ ప్రసాద్ (సి అండ్ ఐ),సంతోష్ కుమార్(ఆపరేషన్స్)కిరణ్ బాబు (పర్సనల్),స్వామి రాజు(యాష్),ఎస్ఈ (స్టోర్స్)శ్యాం సుందర్, సేఫ్టీ అధికారి పులి సురేష్ తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫిన్లాండ్ నుండి స్వదేశానికి తిరిగి వస్తున్న ఉపాధ్యాయులు



**జన్నారం,ఏప్రిల్14 (ప్రజాజ్యోతి)** ఫిన్లాండ్ దేశంలో విద్యపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం తరపున ఎంపికైన ఉపాధ్యాయులలో జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దాముక కమలాకర్,అక్కపెల్లి గూడ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ లు నాలుగు రోజుల పర్యటన ముగించుకొని నేడు స్వదేశానికి తిరిగి వస్తున్న వారిద్దరికీ రేండ్లగూడ విశ్వ బ్రాహ్మణ సంఘం తరపున ఘనస్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విదేశీ విద్య అధ్యయనం పై మండల ఉపాధ్యాయులు ఫిన్లాండ్ వెళ్లడం మండలానికే గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్,సామాజిక వేత్త భూమాచారి,రేండ్లగూడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రవి చారి, బండోజు లక్ష్మీ నర్సయ్య,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

# వి. నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆల్ ఫోర్స్ టాపర్స్‌కు ఘన సన్మానం

**రాష్ట్ర స్థాయిలో మెరిసిన మంచిర్యాల విద్యార్థులు**

**అద్భుత ఫలితాలతో నంబర్ వన్ స్థానం**





**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** తెలంగాణలో ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలకు చెందిన మంచిర్యాల జిల్లా మంచిర్యాల బ్రాంచ్‌లో ఈ ఏడాది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ముఖాముఖి అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంచిర్యాల ఐబి చౌరస్తాలో గల ఆల్ ఫోర్స్ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి, వారి మార్కులు, వివరాలను సభికుల ముందుంచారు. అనంతరం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కూడా అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం తల్లిదండ్రుల్లో ఆనందాన్ని, విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థులు సాధించిన మార్కులను ప్లేకార్డుల రూపంలో ప్రత్యేకంగా ముద్రించి ప్రదర్శించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విద్యార్థులు గ్రూప్ ఫోటోలు దిగుతూ తమ విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మంచిర్యాల బ్రాంచ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కృషి ఉంటే మనిషి ఋషి అవుతాడని, కష్టపడితేనే ఫలితం దక్కుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2026 ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నంబర్ వన్ స్థానంలో నిలవడం గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. మంచిర్యాల, కరీంనగర్ తదితర బ్రాంచ్‌లలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలవడం వారి కష్టం, కృషికి నిదర్శనమన్నారు. ముఖ్యంగా మంచిర్యాల బ్రాంచ్ విద్యార్థులు ఈ ఏడాది ఒక అడుగు ముందుకు వేసి గతంలో ఎన్నడూ లేని విధంగా అద్భుత ఫలితాలను సాధించారని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో తెలంగాణ రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలవడం అభినందనీయమన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో పేరు నిలబెట్టారని వివరించారు. ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలు కేవలం సైన్స్‌లోనే కాకుండా ఆర్ట్స్, కామర్స్ విభాగాల్లో కూడా మంచి ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ఐఐటీ జేఈఈలో 116వ ర్యాంకు సాధించడం, మరొక విద్యార్థి 2 వేల లోపు ర్యాంకు పొందడం విశేషమన్నారు. గత ఏడాది ఎంబీబీఎస్‌లో ఇద్దరు విద్యార్థులు ప్రవేశం పొందినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌తో పాటు నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో కూడా తమ విద్యార్థులు అధికంగా ఎంపికై ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుత ఫలితాలు సాధిస్తామన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తూ, పదవ తరగతి తర్వాత ఇంటర్మీడియట్ రెండేళ్లు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని, ఈ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి కాలేజీలో చేర్పిస్తే ఎంసెట్, నీట్ వంటి పరీక్షల్లో సీట్లు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. మంచిర్యాల ఆల్ ఫోర్స్ కళాశాలలో హాస్టల్ సౌకర్యం అవసరమైన వారికి మాత్రమే కాకుండా, డే స్కాలర్స్‌కు కూడా అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రెండు దశాబ్దాల పైగా అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారన్నారు. రాబోయే మే నెలలో జరిగే నీట్, ఎంసెట్ పరీక్షల్లో కూడా తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, అలాగే ఆల్ ఫోర్స్ విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**రెండవ సంవత్సరం టాపర్ విద్యారులు వీరే .............**

ఎంపీసీ విభాగంలో గోపతి హిందవి -- 996 మార్కులు (ప్రథమ స్థానం), చల్లా అమితావ్ రాజ్ -- 994, అవిడపు లక్ష్య -- 993 మార్కులతో తరువాత స్థానాల్లో నిలిచారు. 992 మార్కులతో అలొక్ శర్మ, చకాపురం అభినవ్, బండి రిషిత్ ముగ్గురు సమానంగా రాణించారు. మొహమ్మద్ సోహెబ్ దావూద్ -- 991 మార్కులు సాధించగా, గొల్ల అనూ, పలడుగుల సాత్విక -- 990 మార్కులతో టాప్ జాబితాలో నిలిచారు. బీపీసీ విభాగంలో రెంక వృష్ణవి 995 మార్కులతో అగ్రస్థానం. ఎంఈసీ విభాగంలో ఆకుల శ్రీ హర్షిత 983, ఉపాధ్య ఖుషి -- 981. సీఈసీ వి...

## ఆర్టీసీ సమ్మెకు ఉద్యోగ సంఘాల సంఘీభావం....!




**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**గత మూడు రోజులుగా సమ్మె బాట పట్టిన ఆర్టీసీ కార్మికులకు మంచిర్యాల జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. శుక్రవారం ఉదయం ఆత్మాహుతికి పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి అఖిలపక్ష నాయకులు నివాళు లర్పించారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం తగదని, ఆర్టీసీ ఉద్యోగులు మరింత దీక్షతో ఉద్యమించి తమ న్యాయమైన హక్కులను సాధించు కోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు ధైర్యం కోల్పోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ రంగు రాజేశం, మంచిర్యాల జిల్లా పౌర సేవా సంఘం అధ్యక్షులు కనుకుంట్ల మల్లయ్య, సింగరేణి జేఏసీ నాయకులు కైలాసం, బీమా ఉద్యోగుల సంఘం నాయకులు ఎం. రామదాసు, రిటైర్డ్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ షబ్బీర్ పాషా, అన్నం రమేష్, ఆర్టీసీ జేఏసీ నాయకులు శంకరయ్య, శ్రీనివాస్ తదితరులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలు: సర్పంచ్ గంగారం

**అంకుసాపూర్‌లో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24:**ప్రజా జ్యోతి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం అంకుసాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ టేకం గంగారం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగారం మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలే కీలకపాత్ర పోషిస్తాయని, గ్రామీణ వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. "గ్రామాలే దేశ అభివృద్ధికి పట్టుకొమ్మలు" అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. స్థానిక స్వపరిపాలనకు ప్రతీకలైన పంచాయతీలు బలంగా పనిచేస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని తెలిపారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు స్వయం పరిపాలన హక్కులు లభించాయని, ఇది ప్రజాస్వామిక వికేంద్రీ కరణకు దిశానిర్దేశం చేసిందని గుర్తుచేశారు. సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి సాధనలో పంచాయతీలు జవాబుదారీతనం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు విమల, బుట్లే లలిత, నైతం సోంబాయి, వెడమ్మా సోము, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ పట్టణంలోని 5వ వార్డు పరిధిలో ఇందిరమ్మ గృహ పథకం కింద నిర్మించిన నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ముఖ్య అతిథిగా హాజరై, గృహ యజమానులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గృహ యజమానికి నూతన వస్త్రాలు అందించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.. పేదల జీవితాల్లో స్థిరత్వం తీసుకురావడంలో సొంత ఇల్లు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా వారి గృహ కలను నిజం చేస్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తిస్తూ, గృహ నిర్మాణం వంటి ప్రాధాన్య రంగాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా పేదల అభ్యున్నతికి మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అనుమండ్ల స్వప్నరాణి-సాయి, డీసీసీ ఉపాధ్యక్షులు తారీక్ బిన్ అహ్మద్, కట్కర్ భీమ్రావు, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, నాయకులు ఖలీం, సుజాయిత్ ఖాన్, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు

**మంచిర్యాల, 24,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ (బి.ఎస్.పి) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా బి.ఎస్.పి కమిటీ ఆర్టీసీ కార్మికులకు శుక్రవారం సంఘీభావం తెలిపింది.ఆర్టీసీ కార్మికులతో కలిసి పెద్దపల్లి పార్లమెంట్ జోన్ ఇంచార్జ్ కాదాసి రవీందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్టీసీ విలీన చట్టం-2023ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త సర్వీస్ రూల్స్‌ను వెంటనే విడుదల చేసి, ఉద్యోగు లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ హోదా కల్పించాలని కోరారు.గత పదేళ్లలో ఖాళీ అయిన సుమారు 20 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పని ఒత్తిడి తగ్గించి ఉద్యోగుల భద్రతను పెంచాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 2021--2025 వేతన సవరణలను ప్రకటించి, సరైన ఫిట్‌మెంట్‌తో కొత్త వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఆర్టీసీ ఆర్థిక పరిరక్షణ రాయితీల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, 3 వేల 500 కోట్ల పిఎఫ్ బకాయిలపై స్పష్టత ఇవ్వాలని, యాజమాన్యం వినియోగించిన 12 వందల కోట్ల పిఎఫ్ మరియు సీసీఎస్ నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. సంస్థపై ఉన్న సుమారు 9 వేల 500 కోట్ల పాత అప్పులను ప్రభుత్వం స్వీకరించి ఆర్థికంగా విముక్తి కల్పించాలని కోరారు.ఆర్టీసీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి బహుజన్ సమాజ్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం బిఎస్పి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా, కాదాసి రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామిల్ల మురళి, కార్యాలయ కార్యదర్శి రాచర్ల సరేష్, ఈసీ సభ్యులు సెట్టి ప్రవళిక, నాగుల కిరణ్ బాబు, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దాగాం శ్రీనివాస్, ఇంచార్జ్ గోమాస బ్రహ్మానందం, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, బామ్‌సెఫ్ జిల్లా కన్వీనర్ సెట్టి శంకరయ్య, ఆర్టీసీ కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## వసతి గృహాల్లో మరమ్మత్తులు పూర్తి




**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం"ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా వసతి గృహాల్లో పలు మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేశారు.విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో వసతి గృహాల్లో అవసరమైన పనులు నిర్వహించారు. వంటగది పరిశుభ్రత మెరుగుపరిచే చర్యలు తీసుకోవడంతో పాటు, సరైన డ్రైనేజ్ వ్యవస్థ కోసం మరమ్మత్తులు చేపట్టారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా టెర్రస్ గ్రిల్స్‌ను మరమ్మత్తు చేయించారు. అలాగే విద్యుత్ సరఫరా సజావుగా ఉండేందుకు పాడైన స్విచ్ బోర్డులను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. అనూష, జువాలజీ ఆధ్యాపకురాలు ఈ. శైలజ, పీడీ ఎ. అరుంధ నిర్వహించారు.

## కోమటి గూడలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**నాణ్యత, పారదర్శకతతో పనులు పూర్తి చేయాలి: సర్పంచ్ మోతిరం**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 24:ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కనర్గాం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను కోమటిగూడ సర్పంచ్ కోవా మోతిరం గురువారం ఆకస్మికంగా పరిశీలించారు.పని ప్రదేశానికి చేరుకున్న సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి కూలీల హాజరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ పని దినాలు, వేతనాల చెల్లింపు, జాబ్‌కార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పని దొరకడంతో పాటు గ్రామంలో చెరువులు, కందకాలు, మట్టి రోడ్లు వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. పథకం లక్ష్యం నెరవేరాలంటే పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని స్పష్టం చేశారు. కూలీలందరూ సకాలంలో పనులకు హాజరు కావాలని, అక్రమాల కు తావులేకుండా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కూలీల సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## లఘు చిత్రాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానం

**జాతీయ మానవ హక్కుల కమిషన్ మీడియా ఉపసంఘ సభ్యుడు జైమిని కుమార్ శ్రీవాస్తవ**

**మంచిర్యాల, 24,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**జాతీయ మానవ హక్కుల అంశాలపై లఘు చిత్రాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ మీడియా, కమ్యూనికేషన్ ఉపసంఘ సభ్యుడు జైమిని కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వారికి 2 లక్షలు, ద్వితీయ స్థానానికి 1 లక్ష 50 లక్షలు, తృతీయ స్థానానికి 1 లక్ష నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.లఘు చిత్రాలు హిందీతో పాటు ఇతర భారతీయ భాషల్లో రూపొందించవచ్చని, అయితే ఆంగ్ల ఉపశీర్షికలు తప్పనిసరి అని తెలిపారు. చిత్రాల నిడివి కనీసం 3 నిమిషాలు, గరిష్టంగా 10 నిమిషాల మధ్య ఉండాలి.పోటీలకు సంబంధించి చిత్రాలను గూగుల్ డ్రైవ్ ద్వారా జూన్ 30లోపు అప్రతీవంప్రతీటఅశ్రీఎవిప్రఘిఅశ్రీ.ఏశీవ కు పంపాలని సూచించారు. దరఖాస్తు ఫారం, నియమ నిబంధనల వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఈ పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, "హ్యూమన్ రైట్స్ ఇష్యూస్" అనే థీమ్‌పై ఫిక్షన్, డాక్యుమెంటరీ, యానిమేషన్ వంటి ఏ విధమైన లఘు చిత్రాలనైనా సమర్పించ వచ్చని పేర్కొన్నారు. చిత్ర పరిమాణం 2 జీబీ లోపు ఉండాలని తెలిపారు.

## శిక్షణతో స్వయం ఉపాధి పొందాలి ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ఉట్నూర్, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరంగా వివిధ రంగాలపై ఇస్తున్న స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ తరగతులను గిరిజన యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద శుక్రవారం యూత్ ట్రైనింగ్ సెంటర్లో స్కిల్ డెవలప్మెంట్ పై చదువుకున్న గిరిజన యువతి యువకులకు అవగాహన సదస్సు ను ఎమ్మెల్యే తో పాటు ఐటీడీఏ పీవో యువరాజు నార్మల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 28 రకాల కోర్సులలో ఉచితంగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సౌకర్యం, యూనిఫామ్ కల్పించబడం జరుగుతుందని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నిరుద్యోగ గిరిజన యువత అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏపీఓ జనరల్ వసంతరావు, డిడి అంబాజీ జాదవ్, ఏ పీ ఓ పి వి టి జి ఆత్రం భాస్కర్, ఐటీడీఏడిప్యూటీ డిఈఓ చందన్,హెచ్ఓ సందీప్, ఆర్ సి ఓ అగస్టిన్, పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావు, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని యువతకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అందర స్కిల్ శిక్షణ పూర్తి చేసుకుని ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేయాలని నచ్చిన వివిధ కోర్సులకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నాగభూషణం జిల్లా జాబ్స్ మేనేజర్ తో పాటు సిబ్బంది గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.

# రైతుకు నమ్మకమైన విత్తనమే అందించడమే లక్ష్యం

## తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి




**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడం ముఖ్య లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఎఫ్‌పీఓలతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించడం అందరి బాధ్యత అన్నారు. ముఖ్యంగా ఈ రెండు జిల్లాల్లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉండడంతో, నకిలీ పత్తి విత్తనాలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వరి సాగుతో పాటు రైతులు లాభదాయకమైన వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపట్టి, కఠిన ప్రమాణాల అనంతరం ధ్రువీకరించి సరఫరా చేస్తుందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు జిల్లాల్లో విత్తనాల కొరత లేదని, సన్న రకాలలో బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 అందుబాటులో ఉన్నాయని, దొడ్డు రకాలలో కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 కూడా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలనే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి డీలర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందిస్తామని తెలిపారు. ఈ వానకాలంలో రెండు జిల్లాల్లో సుమారు 2 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని, ఇందుకు 50 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని, కనీసం 20 వేల క్వింటాళ్లను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. త్వరలో రానున్న నూతన విత్తన చట్టం రైతుల హక్కులతో పాటు డీలర్ల ప్రయోజనాలను కూడా కాపాడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించేలా, పంట మార్పిడి చేపట్టేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కంది, మినుము పంటలపై అవగాహన పెంచాలని డీలర్లు కోరగా, విత్తన సరఫరాలో మహిళా సంఘాలు భాగ స్వామ్యం కావడం శుభ పరిణామమన్నారు. పంటలను శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా ఆరోగ్య కరమైన దిగుబడులు సాధించవచ్చని, కూర గాయలు, పండ్ల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని సూచించారు. వివిధ పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సహకార శాఖ ప్రతినిధులు, ఏడీఏలు, ఎంఏఓలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దాతలు స్పందిస్తే... ప్రాణాలు నిలబడతాయి

### -- క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి రిషికేశ్వర్‌కు సహాయం అవసరం.



**మందమర్రి, ఏప్రిల్ 24( ప్రజాజ్యోతి ):** మందమర్రి ప్రాంతంలో ఒక చిన్నారి ప్రాణం కోసం ఓ కుటుంబం ఆవేదనతో రోజులు గడుపుతోంది. చిన్న వయసులోనే పెద్ద కష్టాన్ని ఎదుర్కొంటూ, బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న రిషికేశ్వర్ పరిస్థితి స్థానికులను కలిచివేస్తోంది. మందమర్రి రెండో జోన్‌కు చెందిన వేనవంక నారాయణ--శ్రీలత దంపతులు ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, తమ పిల్లలు మంచిగా చదువుకుని ఎదగాలని కలలు కనేవారు. కుమార్తె మనస్విత, కుమారుడు రిషికేశ్వర్ చదువులో చురుకుగా ఉండి, మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నారు. అయితే, ఆ కుటుంబాన్ని అనుకోని విధంగా పెద్ద కష్టం తాకింది. కొద్ది నెలల క్రితం తోటి పిల్లలతో ఆడుకుంటున్న సమయంలో రిషికేశ్వర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో అతనికి బ్లడ్ క్యాన్సర్ (ఏఎంఎల్) ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వార్త తల్లిదండ్రులను తీవ్రంగా కుదిపేసింది. ఆడిపాడే వయసులో బిడ్డ ఇలాంటి ప్రాణాంతక వ్యాధితో బాధపడటం వారిని మౌనంగా రోదింపజేస్తోంది. తమ కుమారుడిని కాపాడుకోవాలనే తపనతో ఎక్కడికక్కడ తిరుగుతూ ఇప్పటివరకు సుమారు రూ.35 లక్షల వరకు అప్పులు చేసి చికిత్స కొనసాగిస్తున్నారు. కుటుంబంలో ప్రేమ ఎంత ఉందో చెప్పే విధంగా, అక్క మనస్విత సైతం తన తమ్ముడి కోసం బోన్ మారో దానం చేయడం హృదయాలను కదిలిస్తోంది. అయినప్పటికీ, పూర్తి స్థాయి చికిత్స కోసం ఇంకా సుమారు రూ.20 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. ఇప్పటికే అప్పుల భారంతో మానసికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబం, ఇప్పుడు దాతల సహాయం కోసం ఆశగా ఎదురుచూస్తోంది. మా బిడ్డను కాపాడండి... మళ్లీ అతను నవ్వాలని ఉంది, అంటూ తల్లిదండ్రులు కన్నీటి కళ్లతో విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంతకుముందు మూడేళ్ల క్రితం షార్ట్ సర్క్యూట్ కారణంగా వారి ఇల్లు పూర్తిగా దగ్ధమై, లక్షల నష్టం వాటిల్లింది. ఆ సంఘటన నుంచి కోలుకునేలోపే ఇప్పుడు ఈ దుస్థితి ఎదురవడంతో కుటుంబం పూర్తిగా కుంగిపోయింది. ఈ నేపథ్యంలో,సహృదయులు ముందుకు వచ్చి చిన్నారి రిషికేశ్వర్ చికిత్సకు తమ వంతు సహాయం అందించాలని కుటుంబ సభ్యులు మనవి చేస్తున్నారు. దాతలు సహాయం అందించాలనుకుంటే గూగుల్ పే/ఫోన్‌పే నంబర్: 9949156031 (వేనవంక నారాయణ -- శ్రీలత) కు పంపవచ్చు.

## ఆర్టీసీ కార్మికుల హామీలు వెంటనే నెరవేర్చాలి

### మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు



**మంచిర్యాల, 24, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల ఆర్టీసీ డిపోలో కార్మికులు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తెలిపారు. మంచిర్యాల డిపో వద్దకు వెళ్లి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శుక్రవారం సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమైనవని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. ఉద్యోగ భద్రత, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీలు, ఇతర సౌకర్యాల విషయంలో వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆర్టీసీ సమ్మెను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికులు ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు.

## రాజంపేటలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

### గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలు: నేతలు



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24:** ప్రజా జ్యోతి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం రాజంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే దేశ అభివృద్ధికి పునాది అని, "గ్రామాలే దేశ అభివృద్ధికి పట్టుకొమ్మలు" అనే సత్యాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలు బలంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ చట్టం ద్వారా పంచాయతీలకు లభించిన స్వపరిపాలన హక్కులు ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు బాటలు వేశాయని వివరించారు. సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పంచాయతీరాజ్ సంస్థలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

# నైపుణ్యాభివృద్ధి ద్వారానే యువతకు ఉపాధి

## : కలెక్టర్ హరిత సంక్షేమ వారోత్సవాల్లో నిరుద్యోగ యువతకు అవగాహన సదస్సు

### ఉచితంగా ద్విచక్ర వాహన, సెల్‌ఫోన్ రిపేరింగ్ శిక్షణ

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యావంతులైన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉపాధి పొందగలరని, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోగలరని జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం డిగ్రీలు, సర్టిఫికెట్లు ఉంటే సరిపోదని, జీవితంలో స్థిరపడాలంటే చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవడం తప్పనిసరి అని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్, ప్రైవేట్ కంపెనీలు కేవలం నైపుణ్యం ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తున్నాయని, మంచి జీతాలతో ఉద్యోగాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా యువత ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్ఎస్‌డీసీ ద్వారా ద్విచక్ర




వాహన రిపేరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, హౌస్ వైరింగ్, ఏసీ రిపేరింగ్, టైలరింగ్ వంటి పలు రంగాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తామని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేసి బ్యాంకు రుణ సదుపాయం కల్పించి స్వయం ఉపాధి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. యువత చదువుతో పాటు ఏదో ఒక నైపుణ్యంలో నిపుణత సాధిస్తే ఎక్కడైనా ఉపాధి పొందవచ్చని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను నైపుణ్య శిక్షణ వైపు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# సిర్పూర్(టి) మండలం లో16 గ్రామ పంచాయతీలో పంచాయితీ సెక్రెటరీల అధ్యక్షతన

నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినో త్సవ వేడుకలో ఏర్పా టు చేసిన

గ్రామ సభలో పాల్గొన్న పాలకవర్గ సర్పంచులు, ఉపసర్పంచులు,వార్డ్ మెంబర్లు, ప్రజలు

పంచాయతీల సక్రమ నిర్వహణ దేశానికి ప్రగతి గ్రామీణ వ్యవస్థ ప్రతిష్టంగా ఉన్నప్పుడే నిజమైన పురోగతి::

గ్రామాలే దేశ అభివృద్ధికి పట్టుకొమ్మలు,గ్రామ స్వరా జ్యమే,దేశ స్వరాజ్యం:

సిర్పూర్(టి)మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఒడ్డెట్టి నాగమణివార్డు మెంబర్లు,కార్యదర్శి తిరుపతి:

**ఏప్రిల్ 24: సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ తోపాటు మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కేకులు కట్ చేసి జాతీయ పంచా యతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంత రం పంచాయతీలలో సెక్రటరీలు,సర్పంచులు పంచాయతీ పాలకవర్గం గ్రామసభలు ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ వ్యవస్థ పై చర్చించారు. 1992లో భారత రాజ్యాం గం 73వ చట్ట సవరణ జరిగిందని అన్నారు.ఈ సవరణ ద్వారా జిల్లా గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీల ద్వారా పంచాయతీరాజ్ ఏర్పడిందని అన్నారు. ఈ సవరణ 1993 ఏప్రిల్ 24 నుండి అమల్లోకి వచ్చింద ని అన్నారు. 2010 ఏప్రిల్ 24న తొలిసారిగా భారత దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ పంచాయతీరాజ్ దినోత్స వ వేడుకలను నిర్వహిచా రని అన్నారు.గ్రామ ప్రజల కు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ శు భాకాం క్షలు తెలిపారు.అనంత రం అన్ని గ్రామ పంచాయ తీల పాలకవర్గం సర్పంచ్ ఉపసర్పంచ్,వార్డ్ మెంబర్ లతో కలిసి పంచాయతీ సెక్రటరీలు మాట్లాడుతూ.. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారానే స్థానిక సంస్థలకు స్వయం పరి పాలన హక్కులు లభించాయని అన్నారు.దేశ అభి వృద్ధికి గ్రామపంచాయతీ లే కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు.. గ్రామీణ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే నిజమైన పురోగతి సాధ్యమవు తుందని అన్నారు. గ్రామా లే దేశ అభివృద్ధి కి పట్టు కొమ్మలని అన్నారు. సామాజిక న్యాయం సమ గ్ర అభివృద్ధి సాధనలో పం చాయతీలు జావాబుదారి తనం పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం పాలకవర్గం సర్పంచులు మాట్లాడుతూ.. మండలం లోని ప్రతి గ్రామపంచాయి తీలలో ఈ ఆర్థిక సంవత్స రం నిర్వహించవలసిన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రణాళిక లను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. వేసవికాలం దృష్ట్యా



నీటిఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకో వాలని సూచించారు. విధిదీపాలు,పరి శుద్ధం పై ప్రత్యక్ష శ్రద్ధ ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమం లో సిర్పూర్ (టి) మేజర్ గ్రామ పంచాయతీ పాలక వర్గం సర్పంచ్ ఒడ్డేటి నాగమణి,వార్డ్ మెంబర్లు, సెక్రటరీ తిరుపతి,వేంపల్లి సెక్రటరీ ప్రవీణ్, సర్పంచ్ సత్తయ్య, ఉప సర్పంచ్ రాజ్ కుమార్, నవ్వేగం సర్పంచ్ రాజు,సెక్రెటరీ పాలక వర్గం, లక్ష్మీపూర్ సర్పంచ్ రాందాస్, ఉప సర్పంచ్ శేఖర్ సెక్రెటరీ శ్రీనివాస్,అన్ని గ్రామ పంచాయతీల పాలకవర్గం సర్పంచులు, ఉపసర్పంచు లు,వార్డ్ మెంబర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగి నుంచి గ్రూప్-1 అధికారిగా



మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్24(ప్రజాజ్యోతి) శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో,వైస్ ప్రెసిడెంట్ చెన్నూరి శ్రీనివాస్ నేతృత్వంలో ఒక సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.మందమర్రి ప్రాంతంలో సింగరేణి ఉద్యోగిగా సేవలందించి, అనంతరం గ్రూప్-1లో ఎంపికై మంచిర్యాల జిలాల్లో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దుర్గం క్రాంతికుమార్ ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈకార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ దామెర ప్రవీణ్ కుమార్,సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బడికల కృష్ణ, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ హరిరామకృష్ణ, శ్రీరాంపూర్ ఏరియా నాయకులు కంబాల నాగయ్య, దాసరి సంపత్, మోతె రవి, అశోక్, సమ్మయ్య, ప్రదీప్, రవీందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల నెరవేర్చిన ఘనత ప్రజా ప్రభుత్వానిది

**పేదింటి పెద్దన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ఉట్నూర్ రూరల్ ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి)** నిరుపేదల కు సొంతింటి కళ సహకారం చేసింది ప్రజా ప్రభుత్వం దేనని, పేదింటి పెద్దన్నగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఖానాపూర్ ఎమ్మెల్యే విదుమ బొజ్జు పటేల్ అన్నారు. ఆయన శుక్రవారం ఉట్నూర్ మండలంలోని చాందూరి ,నాగపూర్, ఉట్నూర్ మండల కేంద్రంలోని ఫకీర్ గుట్టలో ఇందిరమ్మ పథకం ద్వారా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు ప్రారంభించిన ఎమ్మెల్యేకు నూతన ఇందిరమ్మ ఇండ్ల కుటుంబ యజమానులు శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి పేదవారి కల నెరవేరుతుందని మహిళలు ఆర్థికంగా స్థిరపడుతున్నారని, నిరుద్యోగులు ఉద్యోగాలు పొందుతున్నారని,విద్యార్థులు ఉన్నత విద్య చదువుతూ మంచి భవిష్యత్ వైపు అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. మరెన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకం అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు అధికారులు కాంగ్రెస్ నాయకులు ప్రజలకు తెలియజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, నాగపూర్, చందూరి సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ లబ్దిదారులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై కొరడా

**రైతులు, ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**గుడిహత్నూర్ ఏప్రిల్ 24, (ప్రజా జ్యోతి) :** అధిక వడ్డీలతో రైతులు, ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కొరడా ఝులిపించారు.జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో 45 బృందాలచే 15 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహిం చారు. 16 మండలాలలో దాడులు చేపట్టి, 7 పోలీస్ స్టేషన్లో పరిధిలో 15 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ ప్రకటించారు. వడ్డీ వ్యాపారుల వద్ద నుండి ప్రామిసరీ నోట్లు, చెక్కులు, పాస్ బుక్కులు, బాండ్ పేపర్స్, సేల్ డీడ్స్ స్వాధీనం చేసుకున్నారు. అధిక వడ్డీలతో రైతులు ప్రజల నడ్డి విరుస్తున్న వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవనీ ఎస్పీ హెచ్చరించారు. వివ రాలు ఇలా ఉన్నాయి. అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎస్పీ ఆదేశాల మేరకు మేరకు వడ్డీ వ్యాపారుల ఇండ్లు, వారి కార్యాలయాల్లో స్పెషల్ పార్టీ పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించడం జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించాయి. దాదాపు వంద మంది వడ్డీ వ్యాపారులపై ఆకస్మిక దాడులు నిర్వ హించి వారి ఇండ్లల్లో సోదాలు జరిపారు. వడ్డీకి తీసు కున్న అమాయక ప్రజల నుండి వ్యవసాయ భూము లు తాకట్టు పెట్టుకుని, తమ పేర్లపై రాయించుకోవడం, ప్రామిసరీ నోట్, బాండ్లు, చెక్కుబుక్కులు, ఖాళీ పేపర్స్, స్టాంప్ పేపర్స్, సేల్ డిడ్స్ రాయించుకుని అధిక వడ్డీలకు ఇస్తున్నట్లు ఈ దాడుల్లో తేటతెల్ల మైంది. అసాంఘిక కార్యకలాపాల ను పూర్తిగా రూపుమాపే దిశగా జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు. వడ్డీ వ్యాపారుల ఆగ డాలను అరికట్టేలా జిల్లా వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఇలాంటి ఆకస్మిక తనిఖీలను చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. అధిక వడ్డీలకు ఇచ్చే వడ్డీ వ్యాపారులు ప్రజలను మోసం చేయడం మానుకోవా లనీ స్పష్టం చేశారు. లేని పక్షంలో వారిపై శాఖాపర మైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

**నమోదైన కేసులు.. నిందితుల వివరాలు :**

ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్ లో ఒక కేసు నాయిని సుదర్శన్, (ఖుర్షీద్ నగర్)దతలమడుగు పోలీస్ స్టేషన్ లో 2 కేసులు కటకం రాజు (దేవాపూర్), శ్రీనివాస్ (దేవాపూర్) మావల పోలీస్ స్టేషన్లో కేసు 2 కేసులు కుంటి లింగన్న, (170 కాలనీ), దుర్గారెడ్డి (మావల) నేరడిగొండ పోలీస్ స్టేషన్లో 3 కేసులు. గంగారెడ్డి, (తేజపూర్), శ్రీనివాస్, (నేరడిగొండ), జుంబేరాత్ రాహుల్ (నేరడిగొండ) తాంసి పోలీస్ స్టేషన్ లో 2 కేసులు ఉప్పంచి నగేష్ (కప్పర్ల), ఉప్పంచి గంభీర్ (కప్పర్ల) ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో 4 కేసులు గోతి సుందర్ సింగ్ (ఇచ్చోడ), గిత్తే మారుతి (ఇచ్చోడ), కదం సుదర్శన్ (ఇచ్చోడ), కదం సాయి కృష్ణ సిద్ధాంత్ (ఇచ్చోడ),గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ లో ఒక కేసు దహాలే పవన్, (మన్నూరు)

## ఆర్టీసీ సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎస్పీ నితిక పంత్

**శాంతియుతంగా సమ్మె చేయండి, ఆవేశపడొద్దు: కార్మికులకు సూచన**



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె శిబిరాన్ని జిల్లా ఎస్పీ నితిక పంత్ శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొంటున్న కార్మికులతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమ్మెను శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకూడదని సూచించారు.కార్మికులు ఆవేశాలకు లోనై ఆత్మహత్యల వంటి అఘాయిత్యాలకు పాల్పడకూడదని, జీవితం విలువైనదని అవగాహన కల్పించారు. సమస్యల పరిష్కా రానికి ప్రభుత్వంతో చర్చలు జరిపే మార్గాన్ని ఎంచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు.కార్మికుల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ, సీఐ, ఇతర పోలీసు అధికారులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ రవి, పెంచికల్పేట్ ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గంజాయి, గుడుంబా మత్తు పదార్థాల నివారణ పై ప్రజలకు అవగాహన ర్యాలీ



**ఏప్రిల్ 24, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని పెంచికల్పేట్, మండలంలోని దరోగపల్లి గ్రామ పంచాయతీలో గంజాయి,మత్తు పదార్థాల గుడుంబా నివారణపై పోలీస్ ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా నిర్వహిం చిన అవగాహన ర్యాలీలో సర్పంచ్ కృష్ణవేణి హరీష్ పాల్గొన్నారు.ఈ సందర్భం గా గ్రామ ప్రజలతో కలిసి ఎక్సైజ్ సీఐ రవి, ఎస్సై అనిల్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు మత్తు పదార్థాలు గుడుంబా,గంజాయి, తో కలిగే నష్టాల వల్ల వివరించి,విశ్లేషించి, కులుప్తకరించి ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ సీఐ రవి, ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ.. గంజాయి, గుడుంబా,వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఎవరైనా గంజాయి, గుడుంబా లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరాలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, యువకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీ పాపానికి డ్రైవర్ శంకర్ గౌడ్ బలి

**ఉట్నూర్ లో డ్రైవర్ మృతి పట్ల ఆర్టీసీ కార్మికుల నిరసన ర్యాలీ**



**ఉట్నూర్, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి )** గత ఎన్నికల ముందు కాంగ్రె స్ పార్టీ ఆర్టీసీ ఉద్యోగుల కార్మికుల హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చి నెరవేర్చని పాపానికి ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలి అయ్యారని బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ అన్నారు. ఉట్నూర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని గత మూడు రోజులుగా చేస్తున్న నిరవేదిక శిబిరానికి శుక్రవారం ఆయన నాయకులతో కలిసి వచ్చి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల కార్మికులకు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చక రెండున్నర సంవత్సరాలైనా ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు ఓపికగా ఉండి తమ సమ్మె చేస్తున్నామని ప్రభుత్వానికి నోటీసు ఇచ్చిన పట్టించుకోకుండా మూడు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల నిరాశకు గురైన డ్రైవర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం పై రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్టీసీ ఉద్యోగుల కు కార్మికులకు ఇచ్చిన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రైవేటు డ్రైవర్లతో కొన్ని బస్సులు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టాలు జరుగుతున్నాయని వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మె శిబిరంలో బిజెపి జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ , బిజెపి ఉట్నూర్ మండల అధ్యక్షులు బింగి వెంకటేష్, లక్కారం మాజీ ఉపసర్పంచ్ శ్రీపతి లింగ గౌడ్ నాయకులు సరిగా రాజేశ్వర్ తన్నీరు సతీష్ కుటికెల రమేష్ రామగిరి వేణు చింతల రమణ,ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులు గబ్బర్ సింగ్,సంగీత, కేశవ్, ఎంఎ బేగ్, ఉష తాయి,కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**ఉట్నూర్ ఆర్టీసీ ఉద్యోగుల నిరసన ర్యాలీ**

ఆర్టీసీ సమ్మెలో భాగంగా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనకు నిరసనగా రోడ్డు రవాణా సంస్థ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉట్నూర్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు కార్మికులు శుక్రవారం మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఫ్లెక్సీ తో ఉట్నూర్ లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రభుత్వం డౌన్ లోడ్ శంకర్ గౌడ్ అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్టిసి ఉద్యోగ సంఘ నాయకులు గబ్బర్ సింగ్, ఎంఎ బేగ్, కేశవ్, సంగీత , ఉష తాయి కార్మికులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ ఎమ్మెల్యే,

నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ పర్యటన



**ఖానాపూర్ ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షులు వెడుమ బొజ్జు పటేల్ పర్యటన వివరాలను ఎమ్మెల్యే పి ఏ సునీల్ ప్రకటనలో తెలిపారు శనివారం ఏప్రిల్ 25 ఉదయం 10:30 కు ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని ఉదయం 11 గంటల 30 నిమిషాలకు పెంబి మండలం పసుపుల బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ అనంతరం పెంబి మండలం కిష్టా నాయక్ తండ గ్రామ పంచాయతీ మోరోని పరుపు గ్రామంలో అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారన్నారు ఉదయం 1 గంటకు ఖానాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రారంభిస్తారని ముందస్తు సమాచారం అధికారులు పోలీసులకు పాత్రికేయులకు , కాంగ్రెస్ కార్యకర్తల శ్రేయోభిలాషు ల కోసం సమాచారం అందజేయమైనదని ఎమ్మెల్యే పి ఏ సునీల్ తెలిపారు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ని కలి సిన మాజీ ఎంపీ,రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)**తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ మైనారిటీ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ని హైదరాబాద్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాకు ప్రత్యేక నిధులు మంజూరు చెయ్యాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సో యం బాపూరావు అన్నారు. సోయం వెంట మాజీ డిసిసిబి చేర్మెన్ అడ్డి భోజ రెడ్డి, గొర్ల రాజు యాదవ్, శ్రీధర్ రెడ్డి, శంషోద్దీన్, దేవానంద్ తదితరులు ఉన్నారు.

## సిరిచేల్మ శ్రీ. మల్లిఖార్జున స్వా మి ఆలయాన్ని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఇచ్చోడ, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ మండలంలోని మారు మూల అటవీ ప్రాంతం లోని అతి పురాతన ఆలయం సిరిచేల్మ గ్రామంలో ఉన్న పురా తన మహిమగల శ్రీ. మల్లి కార్జున స్వామి ఆలయాన్ని శు క్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించు కొని ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ ఎమ్మె ల్యే అనిల్ జాదవ్ తో పాటు పలువురు మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



**నేరడిగొండ, ఏప్రిల్ 24 ప్రజాజ్యోతి :** మండలంలోని వడ్డూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అందరం సమిష్టిగా కృషి చేస్తామని సర్పంచ్, వార్డు సభ్యులు మరియు సిబ్బందితో ప్రమాణ స్వీకారం చేయించారు. పల్లెల ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సద్దాం, ప్రముఖ నాయకులు చంద్రశేఖర్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కూడా ఉండాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందంజలో ఉంటామని వారు స్పష్టం చేశారు.

## అంధకారాన్ని పారద్రోలినజిల్లా పోలీసులు

జైతు పటేల్ గూడలో వెలుగులు గ్రామానికి వెళ్లే మార్గం సౌకర్యం

ఆదివాసీలకు 22 నూతన వి ద్యుత్ దీపాల ఏర్పాటు

3 కిలోమీటర్ల మట్టి దారిని మొరం వేసి అభివృద్ధి చేసిన పోలీసులు

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కు గ్రామస్తుల కృతజ్ఞతలు



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖ సామాజిక బాధ్యతగా మ రో వినూత్న కార్యక్రమాన్ని చే పట్టింది. అంధకారంతో సత మతమవుతున్న జైతు పటేల్ గూడ గ్రామంలోని ఆదివాసీలకు 22 నూతన విద్యుత్ దీ పాలను ఏర్పాటు చేసి గ్రామానికి వెలుగులు నింపింది. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఐపీఎస్ మార్గదర్శ కత్వంలో నిర్వహించారు. శుక్ర వారం సాయంత్రం సిరికొండ ఎస్సై పూజ ఈ విద్యుత్ దీపాలను ప్రారంభించారు. ఈ దీపాల ఏర్పాటు వల్ల గ్రామంలో రాత్రివేళ భద్ర త పెరగడంతో పాటు ప్రజలకు సౌకర్య వంతమైన వాతావరణం ఏర్పడిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అదనంగా, గ్రామా నికి వెళ్లే దాదాపు 3 కిలో మీటర్ల మట్టి దారిని జిల్లా పోలీ సులు 130 ట్రాక్టర్ల సహా యంతో మొరంమట్టిని వేసిన రిచేశారు. దీంతో గ్రామస్తులకు రాకపోకలు సులభతరం అయ్యాయి. ఈ పనులకు సహ కరించిన సిరికొండ జే సీబీ, ట్రాక్టర్ యూనియన్ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ స్తులు జిల్లా ఎస్పీకి జీవితాంతం రుణపడి ఉంటామని, ప్రత్యేక ధన్యవాదా లు తెలియజేశారు. పోలీస్ శాఖ ప్రజల సంక్షే మానికి కట్టుబడి పనిచేస్తోంద ని ప్రశంసించారు.జిల్లా పోలీస్ శాఖ కేవలం చట్ట పరిరక్షణకే కాకుండా, ప్రజల జీవన ప్రమా ణాలను మెరుగు పరిచే దిశగా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని అధికారు లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పూజతో పాటు గ్రామ స ర్పంచ్ లక్ష్మణ్, యూనియన్ నాయకులు షేక్ ఇమామ్, షేక్ బబ్లు, నీలకంఠ, అంబాజీ, సునీల్ పటేల్, పోలీస్ సిబ్బంది తదితరులు పా ల్గొన్నారు.

## టీలా వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



**ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 24 (ప్రజాజ్యోతి)** ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని, కొమ్ముగూడ గ్రామానికి చెందిన ఆడే జల్లి బాయి మొబిల్ కుమారుడైన, ఆడే శ్యామ్ ఆర్మీ డిపార్ట్మెంట్ ఉద్యోగి పెళ్లి సందర్భంగా శుక్రవారం వారి నివాసం లో బంజారా సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన టీలా (విందు) కార్యక్రమం ఘనంగా జరిగాయి , ఈ వేడుకల్లో పెళ్లి కుమారుని హాజరైన ప్రముఖులు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమ0లో బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, న్యాయవాది గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు బానోత్ జగన్ నాయక్, జాదవ్ గోపాల్ రావు, ప్రజా ప్రజా సంఘాల జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నేతావత్ రాందాస్ నాయక్, బానోత్ రామారావు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జేపీ నాయక్, బిజెపి నాయకులు రాజేశ్వర్ దేవిదాస్ తదితరులు పాల్గొని నూతన పెళ్లి కుమారుని ఆశీర్వదించారు.

## జిల్లా కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసిన ఖానాపూర్ నూతన మున్సిపల్ చైర్పర్సన్ అంకం మౌనిక



**ఖానాపూర్ ఏప్రిల్ 24 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మున్సిపల్ చైర్పర్సన్గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అంకం మౌనిక శు క్రవారం సాయంత్రం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చైర్పర్సన్తో పాటు పలువురు కౌన్సిలర్లు కలెక్టర్కు పూలమొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు.అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చైర్పర్సన్ సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బొప్పార పు సత్యవతి, గుమ్ముల అశోక్ బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ అంకం మహేందర్ ప్రకాష్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 24 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సామెల గ్రామంలో ట్రా క్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘట నలో యువకుడు మృతి చెందాడు. సామెల గ్రామానికి చెందిన సెండే నారాయణ కుమారుడు శివ ట్రాక్టర్ నడుపుతుండ గా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న వాంకిడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసిఫాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# గంజాయి పై ఉక్కుపాదం

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అర్ధరాత్రి రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై ప్రత్యేక గంజాయిత నిఖీలు**

**గత రాత్రి జిల్లా వ్యాప్తంగా 60 సస్పెక్ట్ షీటర్లు, రౌడీషీటర్ల పై గంజాయి తనిఖీలు**

**గంజాయి సేవించి పట్టుబడిన వారిపై జిల్లా వ్యాప్తంగా 15 కే సులు నమోదు**

**గంజాయి వినియోగదారులకు డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించేందుకు చర్యలు**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు గత రాత్రి జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా గంజాయి కేసులలో ఉన్నటు వంటి రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీ టర్లపై ప్రత్యేకంగా గంజాయి తనిఖీలు నిర్వహించారు. మొత్తం 60 మందిని తనిఖీ చేయగా, ఇందులో గంజాయి సేవిం చిన 15 మంది వ్యక్తులపై కే సులు నమోదు చేయడం జరిగింది. రౌడీ షీటర్లు సస్పెక్ట్ షీట ర్లు గంజాయి కి దూరంగా ఉండాలని, లేనియెడల వారిపై మరింత కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు గంజాయికి దూరంగా ఉండా లని, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడ కూడదని ఎస్పీ సూచించారు. గంజాయి వినియోగం వ్యక్తి గత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపు తుందని తెలిపారు. గంజాయి పండించిన, వర్తకం చేసిన, వినియోగించిన, రవాణా చేసిన వారిపై చట్ట పరమైన కఠిన చ ర్యలు తప్పవని స్పష్టం చేశా రు. అలాగే రౌడీ షీటర్లు, సస్పె క్ట్ షీటర్లు గంజాయి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ మాద కద్రవ్యాలపై పోలీస్ శాఖ నిరం తరం నిఘా ఉంచి, ఇలాంటి కార్యకలాపాలను పూర్తిగా ని ర్మూలించే దిశగా కృషి చేస్తుం దని తెలిపారు. ఇదివరకే గం జాయి పండించిన వ్యక్తులకు ప్రభుత్వ పథకాలు అందకుం డా సిఫార్సులు చేయడం జరి గిందని తెలిపారు. ప్రజలు మోసగాళ్ల చేతిలో మోసపో కుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యక లాపాలపై వెంటనే పోలీసు లకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి బారిన పడిన వ్యక్తులను తిరిగి సాధారణ జీవితంలోకి తీ సుకురావడానికి డి-అడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేప డుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యుల సహకారం అత్యంత అవసరమని, వారు ముందు కు వచ్చి తమ కుటుంబ స భ్యులను పునరావాస కేంద్రా లకు పంపిస్తే పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని సూ చించారు. జిల్లా వ్యాప్తంగా గం జాయి వినియోగాన్ని గుర్తిం చేందుకు 25 గంజాయి పరీక్ష కిట్లను వినియోగిస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ కిట్ల ద్వారా త్వరితగతిన తనిఖీలు నిర్వహించి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం జరు గుతుందని తెలిపా రు. జిల్లాలో గంజాయి వ్యాపారం, విని యోగం పూర్తిగా నిర్మూ లించే దిశగా పోలీస్ శాఖ కట్టుదిట్ట మైన చర్యలు కొన సాగిస్తుం దని, ప్రజలు కూడా అప్రమ త్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఆధునిక ప్ర పంచంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. శుక్రవారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆధునిక నై పుణ్యాభివృద్ధి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతి థిగా పాల్గొని, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలం పూర్తిగా సాంకే తిక ఆధారితమైందని, కంప్యూటర్ యుగంలో ప్రతిభతో పాటు నైపుణ్యాలకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. జిల్లా లోని యువత తమ సామర్థ్యాలను పరిమితం చేసుకోకుండా ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న అవకాశాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. స్పష్ట మైన లక్ష్యాన్ని నిర్దే శించుకుని, దాన్ని సాధించేందుకు క్రమ శిక్ష ణతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, ఉపాధి అవకాశా లకు అనుసంధానం చేయడ మే ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని, యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, కళాఅకాడమీ సంయుక్త ఆ ధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో నిపుణులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలను వివరించారు. ముఖ్యంగా ఐటీ, సేవా రంగం, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు, శిక్షణా మార్గాలను స్పష్టంగా వివరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, ఇంటర్వ్యూ నైపుణ్యా లు, డిజిటల్ స్కిల్స్‌పై వివరిం చారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డా. జై సింగ్ రాథోడ్, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గణేష్ జాదవ్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఎస్సీ కార్పొ రేషన్ ఈడి ఎం. మనోహర్ రావు, మైనార్టీ సంక్షేమ అధికారి కలీం, యువజన క్రీడల అధికారి జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలి

: ఖానాపూర్ బార్ అసోసియేషన్ విన్నపం



**ఖానాపూర్ ఏప్రిల్ 24( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల త్వరితగతిన పరిష్కారం కోసం వెంటనే రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరుతూ ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి కి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం రెగ్యులర్ జడ్జి లేక పోవడంతో ఇన్‌చార్జ్ జడ్జిల ద్వారా కార్యకలాపాలు సాగుతున్నాయి, దీనివల్ల వాయిదాలు పడటం, కేసుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని అన్నారు స్థానిక ప్రజలకు న్యాయం త్వరగా అందేలా చూడాలని, పూర్తిస్థాయి న్యా యమూర్తిని కేటాయించాలని కోరారు. న్యాయ వ్యవస్థలో ఖాళీల భర్తీ వల్ల సామాన్య ప్రజలకు న్యాయం చేరువవడమే కాకుండా, న్యాయవాదుల వృత్తిపరమైన పనితీరు కూడా మెరుగుపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వెంకట్ మహేంద్ర న్యాయవాది బక్కశెట్టి కిషోర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఇబ్బందులు కలగ కుండా పెద్ద మొత్తంలో మొ క్కజొన్న సబ్ సెంటర్ ల ఏర్పాటు

**సోమవారం నుండి జొన్న కొ నుగోలు కేంద్రాలను ప్రారంభి స్తాం**

**ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** బహిరంగ మార్కెట్లో పంటల కు ధరలేనందున ప్రభుత్వ కొ నుగోలు కేంద్రాల్లో మద్దతు ధ రతో తమ పంటలను అమ్ము కోవాలని ఎమ్మెల్యే పవార్ రా మారావు పటేల్ రైతులకు సూచించారు. మార్కెట్లో మొ క్కజొన్న పంటకు ధర లేకపోవ డంతో సబ్ కేంద్రాలు ఏర్పా టు చేయాలని పెద్ద మొత్తంలో రైతుల నుండి వినతి పత్రాలు రావడంతో ఆయన గత రెం డు రోజుల నుండి హైదరాబా దులోనే ఉంటూ మంత్రుల ను, అధికారులను కలుస్తూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేయిస్తున్నారు. రైతుకు ఇబ్బందులు కలగ కుండా ఆయన అన్ని చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మొ క్కజొన్న కొనుగోలు కేంద్రాల తో పాటు సోమవారం నుండి జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. బహిరంగ మార్కెట్లో ధర తక్కువ ఉన్నందున తమ పంటను అమ్ముకొని రైతులు నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్మాలని, అమ్మకం డబ్బులను సత్వరం ఇప్పించే ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు వెను వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, అన్ని ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కుంటాల మండల నాయకులు జి వి రమణారావు, చిన్నారావు తదితరులు ఉన్నారు.

# ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రగతికి "ప్రతాప" చిహ్నం









**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24(ప్రజా జ్యోతి)** "విద్యాసంస్థ అంటే కేవలం నాలుగు గోడల మధ్య జరిగే బో ధన కాదు. అది విద్యార్థుల కలలను సాకారం చేసే ఒక క ర్మాగారం." అడ్మిషన్ల కొరత, వనరుల లేమి వంటి సవాళ్ల తో ప్రభుత్వ విద్యాక్షేత్రం సత మతమవుతున్న నేటి తరు ణంలో, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక కొత్త ఒరవ డిని సృష్టించింది. ఒక దార్శ నికత కలిగిన నాయకుడు తలుచుకుంటే మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో కూడా విద్యా విప్లవం సాధ్యమని ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ ని రూపించారు. అధ్యాపక బృం దాన్ని ఒక శక్తివంతమైన సై న్యం లా మలిచి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యే యంగా ఆయన సాగిస్తున్న ఈ ప్రగతి ప్రయాణంపై ప్రత్యేక కథనం.

### అడ్మిషన్ల ప్రభంజనం
### 840 అడుగుల నమ్మకం

ప్రైవేట్ విద్యాసంస్థల ఆకర్ష ణీయమైన ప్రకటనలు, ప్రలో భాల మధ్య ప్రభుత్వ కళాశా లల ఉనికి ప్రశ్నార్థకమవుతు న్న తరుణంలో, ప్రతాప్ సింగ్ కార్యాలయంలో ఉండి ప్రణ ళికలు వేయడమే కాకుండా, స్వయంగా క్షేత్రస్థాయిలోకి ది గారు. ఆయన తన సహచర అధ్యాపకులను కేవలం బోధ కులుగా కాకుండా, 'విద్యా రాయబారులు'గా మార్చారు. ఒక క్రమశిక్షణ కలిగిన సైన్యం లా ప్రతి అధ్యాపకుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మా రుమూల గిరిజన గూడేలను సైతం సందర్శించి, నాణ్యమైన బోధన, ప్రభుత్వం అందించే ఉచిత విద్యపై అవగాహన క ల్పించారు. దీని ఫలితంగా రికార్డు స్థాయిలో 840 అడ్మిష న్లు నమోదయ్యాయి. ఇది కేవ లం ఒక సంఖ్య మాత్రమే కాదు, వేలాది గిరిజన కుటుంబా ల ఆశల ప్రతిరూపం. చదువు మధ్యలో మానేద్దామనుకున్న ఎంతోమంది విద్యార్థులు ఆయన ప్రేరణతో మళ్ళీ పుస్తకా లు పట్టడం గొప్పపరిణామం.

### మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు అంటే విద్యా ర్థుల అభ్యసనానికి ఊపిరి పో సే సాధనాలు. నిధుల లేమిని సాకుగా చూపకుండా, ప్రతాప్ సింగ్ ఒక 'మేనేజ్‌మెంట్ గురు వు'గా వ్యవహరించి బాహ్య వనరులను ఏర్పారు చుకు న్నారు.

### కళాశాలకు 10లక్షల రూపాల పుస్తకాలు:

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొ జ్జుని ఒప్పించి సుమారు 10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో అకడమిక్ పుస్తకా లతో పాటు పోటీ పరీక్షలకు (గ్రూప్1, 2, ఎస్ ఐ) ఉపయో గపడే విలువైన మెటీరియల్ ను విద్యార్థులకు చేరవేర్చారు. నేడు ఈ లైబ్రరీ యువతకు ఒ క దేవాలయంలా మారింది. కళాశాల భద్రత కోసం ఎమ్మె ల్యే సహకారంతో సుమారు ఒక కోటి రూపాయల వ్యయం తో ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఖుష్బు గుప్తా ఐఏఎస్ ని సంప్రదించి 10 అ త్యాధునిక కంప్యూటర్లు, 2ప్రిం టర్లు, 50 ఫ్యాన్ లను మంజూరు చేయించారు. దీనితో కళాశాలలో కార్పొరేట్ స్థాయి వసతులు సమకూరాయి.

### ఎన్ ఎస్ ఎస్ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్

విద్యార్థులలో సేవా భావం, నాయకత్వ లక్షణాలను పెం పొందించడంలో ఎన్ ఎస్ ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో ఉట్నూర్ కళాశాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ కు వేదికైంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వందలాది మంది వాలం టీర్లకు కళాశాల ఘనంగా ఆతి థ్యమిచ్చింది. గిరిజన కళలు, జానపద నృత్యాలతో కళాశా ల ప్రాంగణం కన్నుల పండుగ గా మారింది. 'నేను కాదు -- నీ వు' అనే నినాదాన్ని నిజం చేసే లా సామాజిక అంశాలపై అవ గాహన కల్పించడంలో ఈ ఫె స్టివల్ మైలురాయిగా నిలిచింది.

### జాతీయ సదస్సు
### గిరిజన అభివృద్ధి- పునర్నిర్మాణం -- ఉట్నూర్ కళాశాల సరి కొత్త చరిత్ర

మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ కళాశాల, దేశం గర్వించే స్థాయి మేధావు లకు వేదిక కావడం సామా న్యమైన విషయం కాదు. ప్రి న్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ దా ర్శనికత, పట్టుదలతో నిర్వ హించిన రెండు రోజుల జాతీ య సదస్సు "రీ ఇమాజినింగ్ ట్రైబల్ డెవలప్ మెంట్" గిరిజన అధ్యయనాల్లో ఒక నూత న అధ్యాయాన్ని లిఖించింది.

### ప్రముఖుల భాగస్వామ్యం:

ఈ సదస్సులో ఆదిలాబాద్ ఎం.పి గోడమ్ నగేశ్, ఉట్నూర్ సర్పంచ్ అనిత జాదవ్ వంటి ప్రజాప్రతినిధులతో పాటు, అ కాడమిక్ రంగంలోని దిగ్గజా లు పాల్గొనడం దీని స్థాయిని పెంచింది. ఢిల్లీ నుండి ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐ జి ఎన్ సిఎ) హెడ్ ప్రొఫెసర్ కె. అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి గిరి జన అస్తిత్వంపై చేసిన ప్రసం గం సభికులను ఆలోచింప జే సింది. ఉస్మానియా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాల యం, నాగాలాండ్ వంటి సు దూర ప్రాంతాల నుండి ప్రొఫె సర్లు మాయదేవి, పి. విజయ కుమార్, రాంబోలు స్వయం గా హాజరై తమ పరిశోధన ప త్రాలను సమర్పించారు. ఈ సదస్సు కేవలం కళాశాల ప్రాం గణానికే పరిమితం కాలేదు. వివిధ కారణాల వల్ల నేరుగా రాలేని పరిశోధకులు గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ పరిశోధన పత్రాలను సమ ర్పించేలా ప్రిన్సిపాల్ సాంకేతిక వసతులను కల్పించారు. ఇది మారుమూల ఏజెన్సీ ప్రాంతం లో డిజిటల్ విప్లవానికి ఒక ని దర్శనంగా నిలిచింది. ఈ భారీ విద్యా యజ్ఞం విజయవంతం కావడానికి స్థానిక ఎం.ఎల్.ఎ. వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్ట ర్ రాజర్షి షా ఉట్నూర్ ఐటీ డీఏ పీఓ యువరాజ్ మర్మాట్ లను కలిసి, ఈ సదస్సు ప్రా ముఖ్యతను వివరించడంలో ప్రతాప్ సింగ్ సఫలీ కృతమ య్యారు. వారి నుండి అవస రమైన ఆర్థిక సహాయ సహ కారాలను పొంది, సదస్సును అత్యంత గౌరవప్రదంగా నిర్వ హించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. గిరిజన సం స్కృతిని, వారి మౌఖిక సా హి త్యాన్ని, అద్భుతమైన అస్తి త్వాన్ని కాపాడుకుంటూనే, వారిని ఆధునిక అభివృద్ధి ఫ లాలకు ఎలా చేరువ చేయా లనే అంశంపై ఈ సదస్సు ఒక 'రోడ్ మ్యాప్'ను అందించింది. ఉట్నూర్ వంటి గిరిజన ప్రాం తంలో ఇటువంటి సదస్సులు జరగడం వల్ల స్థానిక సమస్య లకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనే అవకాశం ఏర్పడు తుంది. ఈ జాతీయ సదస్సు నిర్వహణ ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పేరు రాష్ట్ర సరిహద్దులు దాటి దే శవ్యాప్తంగా విద్యా వర్గాల్లో వి నబడింది. ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ నాయకత్వ పటిమకు, అధ్యాపక బృందం అంకితా భావానికి ఈ సదస్సు ఒక ని లువెత్తు నిదర్శనం. ఇది కేవ లం ఒక సమావేశం కాదు, ఏ జెన్సీ ప్రాంతపు విద్యార్థుల మే ధో వికాసానికి వేసిన ఒక బల మైన పునాది.

### ఏజెన్సీ ప్రాంతంలో విద్యా అభివృద్ధికై ప్రతాప్ సింగ్ కృషి

ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశా ల నేడు ఒక నూతన విద్యా శకానికి వేదికైందంటే, దాని వె నుక ప్రిన్సిపాల్ టి. ప్రతాప్ సింగ్ అకుంఠిత దీక్ష, అంకితా భావం, అలుపెరగని శ్రమ ఉ న్నాయి. ఆయన కేవలం ఒక ప్రభుత్వ అధికారిగా బాధ్యత లు నిర్వహించడమే కాకుండా, మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక విద్యా సంస్కర్త గా తన ము ద్రను వేశారు. "నేటి విద్యార్థే రేపటి పౌరుడు" అనే నినా దాన్ని ఆయన కేవలం గోడల మీద రాతలకే పరిమితం చే యకుండా, అక్షరాలా క్షేత్రస్థా యిలో అమలు చేస్తున్నారు. అడ్మిషన్ల రికార్డులు, కార్పొరే ట్ స్థాయి మౌలిక వసతులు, జాతీయ స్థాయి సదస్సులు, విద్యార్థుల ఉద్యోగ సాధనలు ఇవన్నీ ఒక చరిత్రగా మిగిలి పోతాయి. నాయకుడంటే ఆ దేశాలు ఇచ్చేవాడు కాదు, త న ఆచరణ ద్వారా అందరినీ నడిపించేవాడు అని ఆయన నిరూపించారు. అధ్యాపక బృందంలో సామాజిక బాధ్య తను పెంచుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ కళాశాలను ఒక విజ్ఞాన ఆల యంగా తీర్చిదిద్దారు. ప్రతాప్ సింగ్ నేతృత్వంలో ఈ విద్యా సంస్థ రాబోయే రోజుల్లో మరి న్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపులను సాధి స్తుందనడంలో సందేహం లేదు. ఉట్నూర్ వంటి ఏజెన్సీ ప్రాంతంలో ఒక సామాన్య గిరి జన విద్యార్థి కూడా నాణ్యమై న విద్యా సౌకర్యాలను పొంద గలడనే భరోసాను ఆయన క ల్పించారు. చదువు మధ్యలో మానేసే వారి సంఖ్యను తగ్గించి, ఉన్నత చదువుల వైపు వి ద్యార్థులను మళ్లించిన ఆయ న కృషి, ఆయా కుటుంబాల్లో విద్యా వెలుగులను నింపు తోంది. ప్రభుత్వ విద్యా వ్యవ స్థను ఎలా బలోపేతం చేయాలి? పరిమిత వనరులతో అద్భుతమైన ఫలితాలను ఎలా సాధించాలి? అనే అంశాల్లో ఆయన ఇతర విద్యాసంస్థల కు, అధికారులకు ఒక గొప్ప రోల్ మోడల్‌గా నిలిచారు. కళాశాల దశదిశను మార్చి, ఒక అసాధారణ ప్రస్థానాన్ని కొన సాగిస్తున్న 'ప్రతాప' శీలునిగా ఆయన కృషి ఈ ఏజెన్సీ ప్రాం త విద్యా చరిత్రలో చిరస్మరణీ యం. ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నేడు కేవలం ఒక సం స్థ మాత్రమే కాదు, అది వేలాది మంది గిరిజన బిడ్డల విజ యాల చిరునామా.

# కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పెరుగుతున్న మద్దతు
## మూడో రోజుకు చేరుకున్న సమ్మె డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
## ప్రజలకు తప్పని ఇబ్బందులు
## ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్

**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన స మ్మె కొనసాగుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అది తీ వ్ర రూపం దాలుస్తోంది. రోజు రోజుకు ఆర్టీసీ కార్మికులు చేప డుతున్న సమ్మెకు మద్దతు సైతం పెరుగు తుంది. వివిధ పార్టీల, సంఘాల నాయకులు ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలిచి రోడ్డుపై ఎక్కుతూ ఆం దోళనను మరింత ఉధృతం చేస్తున్నారు.

**ఆర్టీసీ కార్మికుల పోరాటానికి భీం ఆర్మీ సంపూర్ణ మద్దతు**
**జిల్లా అధ్యక్షులు షేక్ షకీల్**

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసి రక్షణ కోసం, సమస్యల సాధన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హా మీల అమలు కై టీ ఎస్ ఆర్టీ సీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టి న సమ్మె శుక్రవారం 3 వ రోజు కు చేరుకుంది. వారికి మద్ద తుగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్య క్షుడు షేక్ షకీల్ తమ నాయ కులతో కలిసి డిపో ముందు నిరసనలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీ నం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, 2021 వేత న సవరణ 30% ఫిట్మెంట్‌తో అమలు చేయాలని. 2025 వేతన సవరణ అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల 400 కోట్లు ఆర్టీసికి ఇవ్వాలని, ఆర్టీసీ కా ర్మికులకు ఉద్యోగ భద్రత క ల్పించాలని, బెడ్ విన్నర్ పో స్టులను పర్మినెంట్ ఉద్యోగాల కింద భర్తీ చేయాలని డిమాం డ్ చేశారు. ట్రేడ్ యూ నియ న్ల పై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తిం పు సంఘం ఎన్నికలు నిర్వ హించాలని అన్నారు. ఆర్టీసి ఉద్యోగులపై పని భారాలు త గ్గించాలని, కండక్టర్ డైవర్లలపై కెఎం పిఎల్, ఈ పి కె వేధింపు లు మానుకోవాలని, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొని ఆర్టీసికి ఇవ్వాలని, ఆర్టీసి స్థలాలను ఈ వీ బస్సులకు ఇవ్వరాదని, అద్దె బస్సులను, అద్దె బస్సుల డ్రైవర్లలను ఆర్టీ సిలో విలీనం చేసుకోవాలని (గతంలో మాదిరిగా జాతీ యం చేసుకోవాలి), గ్రేటర్ హై దరాబాద్



జోన్ లో పని చే స్తున్న సిబ్బందిని కరీంనగర్ జోన్, హైదరాబాద్ జోన్లకు బలవంతగా బదిలి చేసే ఉత్త ర్వులను రద్దు చేయాలని, 2019సమ్మె కాలంలో నమోదై న పోలీస్ కేసులను ఎత్తివే యాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్క రించాలని, రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని, అన్ని కేటగిరీలలోని ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చే శారు. రిటైరైన ఉద్యోగుల బకాయిలను అన్నిటినీ చెల్లించాలని, చెల్లించటంతో పాటు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డి మాండ్లతో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు భీం ఆర్మీ జి ల్లా కమిటీ పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించారు. ఈ సం దర్భంగా భీం ఆర్మీ జిల్లా అధ్య క్షుడు షేక్ షకీల్ మాట్లాడు తూ ఆర్టీసీ కార్మికుల కష్టాలను ప్రభుత్వం గాలి కొదిలేయడం సరికాదని, వారి డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకో వాలని డిమాండ్ చేశారు. భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీ ల్ ప్రభుత్వాన్ని కోరారు. కార్మి కులు చేస్తున్న పోరాటం కేవలం వారి హక్కుల కోసమే కాదని, ఆర్టీసీ మనుగడ కోసమని ఆయన పేర్కొ న్నారు. భీం ఆర్మీ పార్టీ ఎల్లప్పుడూ కార్మి కుల పక్షాన ఉంటుందని, వారి పోరాటం విజయవంతం అయ్యే వరకు తమ మద్దతు కొ నసాగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, భీం ఆర్మీ డిస్టిక్ అడ్వైజర్ హర్షద్, భీం ఆర్మీ వార్డ్ ప్రెసి డెంట్ గజ్జు, భీం ఆర్మీ కార్య క ర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రికత్త

**వరంగల్ :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అంత్యక్రియల్లో ఉద్రికత్త నెలకొంది. శంకర్ గౌడ్ శవాన్ని నర్సంపేట డిపోకు తరలించాలని కుటుంబ సభ్యులు కోరారు. డిపోకు తీసుకొస్తే శంకర్ గౌడ్ కు నివాళి అర్పించే అవకాశాన్ని కల్పించాలని కార్మికులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలున్నందున పోలీసులు ససేమిరా ఒప్పుకోలేదు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని వెల్లడించారు. పోలీసుల తీరుపై కేంద్ర మంత్రి మండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసారు. మానవత్వం లేకుండా వ్యవహరిస్తే ఎలా అని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల విజ&ఝప్తిని మన్నించాలని సూచించారు. పోలీసుల వినకపోవడంతో కుటుంబ సభ్యులు, బీజేపీ శ్రేణులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎంకు, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. శంకర్ గౌడ్ శవాన్ని నర్సంపేటకు తరలించేందుకు బలవంతంగా బయటకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, కార్యకర్తలు, కార్మికుల మధ్య పెనుగులాట జరిగింది. నడిరోడ్డుపైనే శంకర్ గౌడ్ శవాన్ని ఉంచారు న పోలీసులు. కోపోద్రిక్తులైన కార్యకర్తలు శవపేటికను తీసేసి శవాన్ని ఎత్తుకుని అంబులెన్స్ లోకి ఎక్కించే యత్నం చేసారు. తరువాత పోలీసులు శంకర్ గౌడ్ శవాన్ని మళ్లీ తమ ఆధీనంలోకి తీసుకున్నారు. శవాన్ని తీసుకెళ్లి ఏం చేసుకుంటారో చేసుకోండంటూ కుటుంబ సభ్యులు అన్నారు. కేంద్ర మంత్రితో పోలీస్ కమిషనర్ మంతనాలు జరిపారు.

## స్వీయ గణన ద్వారా జనగణన వేగవంతం
## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల :** జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జన గణనను రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన రెండవ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని ఇందు కొరకు ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు ప్రముఖ వ్యక్తులు గణన అధికారులు యువత స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని జిల్లాస్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు గ్రామపంచాయతీలు మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ ది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్య

**మాజీ మంత్రి, బిఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రా మన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ చేసుకున్నది ఆత్మ హత్య కాదని, అది ముమ్మాటి కి కాంగ్రెస్ ప్రభుత్వ హత్యనే అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న ఆరోపించారు. సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ న్యాయబద్ధంగా చేస్తు న్న నిరసనను పట్టించు కోకపో వడంతో మనస్థాపానికి గురై డ్రైవర్ ఆత్మహత్య చేసుకు న్నాడని అన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన ఆర్ టి సి ఉద్యోగి డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబా నికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన కు టుంబానికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు నష్ట పరిహారాన్ని చె ల్లించాలని కోరారు. ఆయన కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

## ఆర్ పిజి ఫౌండేషన్, సహకా రంతో మినరల్ వాటర్ ప్లాంట్

**43 కోట్ల తో ఇచ్చోడ నుండి సిరిచేల్మ కీ డబుల్ రోడ్డు**
**సిరిచేల్మ ఆలయ అభివృద్ధికీ 5 కోట్లు**
**త్వరలోనే పనులు మొదలు**
**మారుమూల ఆదివాసి గ్రామాలకు మౌళిక వసతుల కల్పనకీ మొదటి ప్రాధాన్యత బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**





**సిరికొండ, ఎప్రిల్ 24, (ప్రజా జ్యోతి)** మారుమూల ఆదివాసి గిరి జన గ్రామాలకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధా న్యతను ఇస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సిరికొండ మండలంలోనీ నారాయణ్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాజుల్ గూడ గ్రామాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. గ్రామంలో. ఆర్పిజి ఫౌండేషన్, తన సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన మిని రల్ వాటర్ ప్లాంటును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఉన్న మా రుమూల గ్రామాలకు మౌళిక వసతులు కల్పన కీ మొదటి ప్రాధాన్యత నిస్తూ అభివృద్ధి చేసుకుందా మని అన్నారు. ఇ చ్చోడ నుంచి సిరిచెల్మా వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ 43 కోట్ల నిధులు మంజూరైన ట్లు ఆయన తెలిపారు. సిరిచె ల్మ ఆలయ అభివృద్ధికిరూ ఐదు కోట్లు నిధులు కూడా మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల నాయకు లు కార్యకర్తలు, అభిమానులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.